క్లుప్తంగా

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



టీకా వేస్తున్న పశువైద్యాధికారి వినోద్

వాంకిడి: పశువులకు చలికాలంలో సోకే గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి వినోద్ అన్నారు. బుధవారం మండలంలోని కనర్గాం గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేయడం జరిగిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో తులసీ కల్యాణం



పూజలో పాల్గొన్న భక్తులు

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలతో పాటు ఆయా కాలనీల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో తులసీ కల్యాణం నిర్వహించారు. మట్టితో తయారు చేసిన శివుడు, గంగా ప్రతిమలకు పూజలు చేశారు. అనంతరం ఉశిరి, కృష్ణుడి ప్రతిమలకు వివాహం చేశారు. మహా శివరాత్రి, కార్తిక మాసం సందర్భంగా భక్తులు వివిధ రకాల పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

యాంటీ డ్రగ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ రాజేంద్రప్రసాద్

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. సమాజంలో యువత ఎక్కువగా డ్రగ్స్‌పై మొగ్గు చూపుతుందని, దీంతో జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. డ్రగ్స్‌ను అరికట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. చదువుపై దృష్టి పెట్టి మంచి ఉద్యోగాలు సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై రమేశ్, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని కేజీబీవీ, యూఆర్‌ఎస్ పాఠశాలలో ఖాళీగా ఉన్న బోధనేతర పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో సుభాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్‌లోని కేజీబీవీ పాఠశాలలో స్వీపర్ 1, డే వాచ్ మెన్ 1, నైట్ వాచ్‌మెన్ 1 ఖాళీలు ఉన్నాయన్నారు. మహిళలు అర్హత 18 నుంచి 45 సంవత్సరం లోపు ఏడో తరగతి చదివి స్థానికులు అయి ఉండాలన్నారు. యూఆర్‌ఎస్ స్కూల్‌లో అసిస్టెంట్ కుక్ అర్హత పురుషులు, మహిళలు ఏడో తరగతి స్థానికులు అయి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 20వ తేదీ లోపు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు వర్షవాస్ ముగింపు కార్యక్రమం

కౌటాల: మండలం ముత్తంపేట గ్రామంలోని లుంబిని బుద్ధ విహార్‌లో 68వ ధమ్మచక్ర పరివర్తన్ వర్షవాస్ సమాప్తి కార్యక్రమం శుక్రవారం ఉంటుందని లుంబిని బుద్ధవిహార్ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. బుద్ధ విహార్‌లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు, గురు, శుక్ర వారాల్లో రెండు రోజుల పాటు రాత్రి 9 గంటల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కళాకారులచే అంబేద్కర్ జీవిత చరిత్రపై బుర్రకథ ఉంటుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఉపాసక్, ఉపసికులు, అంబేద్కర్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ హామీలకు మోసపోవద్దు

ఇచ్చోడ: కాంగ్రెస్ హామీలకు మహారాష్ట్ర ప్రజలు మోసపోవద్దని, తెలంగాణలో ఆరు గ్యారంటీల పేరుతో నమ్మించి మోసం చేసిందని ముఖరా(కె) మాజీ సర్పంచ్ గాడ్గేమీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్ అన్నారు. బుధవారం కిన్వట్ నియోజకవర్గంలోని పాటోదా, ఇంజెగావ్ గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. తెలంగాణలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి విస్మరించిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 11 నెలలైనా. ఇప్పటికీ హామీలు అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దని సూచించారు. వారి వెంట ముఖరా(కె) గ్రామస్తులు ఉన్నారు.

రుణమాఫీ కోసం ఎదురుచూపు

- ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు అప్‌లోడ్
- నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం



రెబ్బెన: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అర్హులైన ప్రతీ రైతుకు రూ. 2 లక్షల వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీపై దృష్టి సారించింది. ప్రభుత్వం నిధుల సర్దుబాటుకు అనుగుణంగా రైతు రుణాలను మూడు విడుతల్లో మాఫీ చేసింది. అయితే వివిధ కారణాలతో పలువురి రైతులకు మాత్రం రుణమాఫీ కాలేదు. రూ. 2లక్షల లోపు రుణం తీసుకున్న రైతులతో పాటు ఆపై రుణం ఉన్న వందలాది మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉంది. ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురి పేర్లపై తీసుకున్న రుణాలు రూ. 2 లక్షలకు పైగా ఉండడంతో కుటుంబ నిర్ధారణ బాధ్యతలను ప్రభుత్వం వ్యవసాయశాఖకు అప్పగించింది. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించింది. క్లస్టర్ల వారీగా రుణమాఫీ పొందిన రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేశారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం నాలుగో విడుత రుణమాఫీపై స్పష్టమైన ఆదేశాలు, మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రేషన్‌కార్డు లేక..

రుణమాఫీ పథకానికి రేషన్‌కార్డుకు ఎలాంటి సంబంధం ఉండదని ప్రకటించినప్పటికీ రేషన్‌కార్డు లేని కారణంగా వందలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదు. అలాగే ఆధార్‌కార్డులో పేరు, ఇంటి పేర్లు బ్యాంకు ఖాతాలు, పట్టాదారు పాస్ పుస్తకంలో మరోలా ఉండటం వంటి కారణాలతో రుణమాఫీ అందకుండా పోయింది. ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్క రైతుకు రుణమాఫీ వర్తింప చేయాలని భావించి, రైతు రుణమాఫీ పథకం (క్రాప్ లోన్ వైవర్) అనే యాప్ రూపొందించింది. మండలానికి ఒక నోడల్ అధికారిని నియమించి, రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసింది. గ్రీవెన్స్ సైతం ఏర్పాటు చేసి రూ. 2లక్షలకు పైగా రుణాలు తీసుకుని రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో సుమారు 1052 మంది రైతులకు రేషన్ కార్డులు లేకపోవటం, మరో 150 మంది రైతుల పేర్లలో తప్పులు ఉండడంతో పాటు సుమారు 620 మంది రైతుల వరకు రూ. 2లక్షలకు పైన రుణాలు తీసుకున్న వారు ఉన్నారు.

మూడు విడుతల్లో 3,957 మందికి..

ఇప్పటి వరకు మూడు దఫాల్లో రూ. 2లక్షల వరకు రైతు రుణాలను మాఫీ చేయగా మండలంలో 3,957 మంది రైతులు లబ్ధి పొందారు. ప్రభుత్వం రూ. 35.47 కోట్ల రుణాలను మాఫీ చేసింది. మొదటి విడతలో మండలంలో 1660 మంది రైతులకు రూ. 9,22,97,841, రెండో విడతలో 1161 మంది రైతులకు రూ.10,45,78,118, మూడో విడతలో 1136 మంది రైతులకు రూ. 15,78,39,706 రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. అయితే మండలంలో రుణమాఫీ కాని రైతులు మరో 2000 వరకు ఉంటారని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

అప్పు చేసి బ్యాంకులో కట్టిన



2లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో మొదట ఎంతో సంతోషపడ్డాం. కానీ రూ. 2లక్షల వరకు మాత్రమే రుణాలు మాఫీ చేసి అపై రుణం వారిని మాఫీ చేయలేదు. ఎక్కువ ఉన్న మొత్తాన్ని బ్యాంకులో చెల్లించాలని చెప్పితే అప్పులు చేసి మరీ బ్యాంకులో కట్టిన.

– లెండుగూరే బాపురావు, గంగాపూర్

రుణమాఫీ చేయాలి



ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ. 2లక్షల రుణాలను రైతులందరికీ వర్తింప చేయాలి. రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డుల్లో తప్పులు ఉన్నాయని సాకులు చెప్పడం సరికాదు. రూ. 2లక్షల కంటే అధికంగా రుణాలు తీసుకున్న రైతులకు సైతం వెంటనే రుణమాఫీ అమలు చేయాలి.

– కుందారపు బాలక్రిష్ణ, రెబ్బెన

పత్తిని దళారులకు విక్రయించవద్దు

- ఎమ్మెల్యే హరీశ్‌బాబు



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సిర్పూర్(టి): రైతులు దళారులకు, మహారాష్ట్రకు పత్తి విక్రయించకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రావ్‌పేట్ సమీపంలోని శ్రీరామ జిన్నింగ్ మిల్లులో బుధవారం మార్కెట్ కమిటీ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులకు, మహారాష్ట్రకు పత్తి విక్రయించకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలన్నారు. మహారాష్ట్రలో విక్రయించుకొని మోసపోవద్దని సూచించారు. రైతుల సమస్యలుంటే తక్షణమే పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. జిన్నింగ్ యజమాన్యం, మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్యలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సీపీవో వెంగల్ రెడ్డి, ఏడీ మనోహర్, మార్కెట్ కమిటీ సెక్రటరీ భాస్కర్, ఏవోలు గిరీషన్, ప్రేమలత, సత్యనారాయణ, శంకర్, వడ్డేటి నానయ్య, నేరెళ్ల అశోక్, పైడి విలాస్ పాల్గొన్నారు.

కౌటాల: పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం కౌటాలలోని శ్రీ వైష్ణవి మాత కాటన్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాల్‌కు రూ. 7521 మద్దతు ధర ఇస్తుందన్నారు. రైతులు పత్తిని తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్ట పోవద్దన్నారు. సీసీఐ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, కార్యదర్శి భాస్కర్, బండి రాజేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతోనే కార్మికులకు ఉజ్వల భవిష్యత్



శిక్షణ పొందిన భవన నిర్మాణ కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వం నేషనల్ కన్‌స్ట్రక్షన్ అకాడమీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు అందించిన ఉచిత నైపుణ్య శిక్షణతో ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, మండల అధ్యక్షులు మలాకర్, దూడల అశోక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో న్యాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నైపుణ్య శిక్షణ ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కార్మికులకు ఇస్తున్న శిక్షణ భవిష్యత్‌లో ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. శిక్షకులు శంకర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 100 మంది వరకు శిక్షణ పూర్తి చేసుకున్నారన్నారు. పనిలో మెలకువలు, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. స్టైఫండ్, హెల్మెట్, డ్రెస్ కోడ్, స్టేషనరీ అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాంచందర్, ఆనంద్ రావ్, మనోహర్, సదయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్

లింగాపూర్: ప్రతిఒక్కరూ అక్షరాస్యత సాధించాలని లింగాపూర్ బ్యాంక్ మేనేజర్ ముఖేష్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో పాటు చోర్‌పల్లి గ్రామంలో టీజీబీ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలు ప్రధానమంత్రి సురక్ష బీమా, జీవన్‌జ్యోతి, అటల్‌పెన్షన్ యోజన్ పథకాల్లో చేరాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ప్రీమియం బ్యాంకుల్లో లేదా పోస్టాఫీసుల్లో చెల్లించాలన్నారు. తిరిగి రుణాలను పొందాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మనోహర్, కళాజాత బృందసభ్యులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి



రెబ్బెన: సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీపీవో భిక్షపతి

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీపీవో భిక్షపతి అన్నారు. బుధవారం మండలంలోని బుద్ధనగర్‌లో నిర్వహించిన సర్వేను పరిశీలించారు. ప్రజలందరూ సర్వేకు సహకరించాలని కోరారు. సిబ్బంది వివరాల నమోదులో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని సూచించారు. అప్పుడే సమాచారంలో స్పష్టత ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాంపూర్ పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, ఎన్యూమరేటర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



కెరమెరి: పరిశీలిస్తున్న అఖిల్ హుస్సేన్

కెరమెరి: సమగ్ర కుటుంబ సర్వేను మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 1002 కుటుంబాలకు సర్వే నిర్వహించారు. మండలంలో మొత్తం 10,037 కుటుంబాలు ఉన్నట్లు ఎన్యూరేటర్లు గుర్తించారు. మంగళవారం మొత్తం 4,105 కుటుంబాలకు సర్వే నిర్వహించారు. ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంఈవో ఆడే ప్రకాశ్ పర్యవేక్షించారు.

రూ. 10 నాణేలతో పరేషాన్..!

- చలామణిలో లేవని పుకార్లు
- బ్యాంకుల్లో తీసుకోని అధికారులు
- పింఛన్‌దారులు, ఉపాధి కూలీలకు తప్పని తిప్పలు



కౌటాల: ఆర్‌బీఐ ముద్రించిన రూ. 10 కాయిన్స్‌కు మార్కెట్‌లో విలువ లేకుండా పోయింది. పది రూపాయల నోట్లు నోట్‌తో పాటు నాణేలను ముద్రిస్తోంది. కానీ మార్కెట్‌లో ప్రజలు వినియోగించడానికి విముఖత చూపిస్తున్నారు. బ్యాంకుల్లోనూ వాటిని వినియోగదారుల నుంచి తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో జిల్లాలోని పింఛన్‌దారులు, ఉపాధిహామీ కూలీలు, చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు.

బ్యాంకుల్లో నిరాకరణ..

రాష్ట్రంలోని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ. 2016, వికలాంగులకు రూ. 3016 ప్రభుత్వం పింఛన్ చెల్లిస్తోంది. పింఛన్ అధికారులు ప్రతీ నెల పింఛన్‌దారులకు రూ. 10 నాణేలను అందచేస్తున్నారు. ఒకవేళ పింఛన్ తీసుకోకపోతే రెండో సారి రాదనే భయంతో తీసుకుంటున్నారు. వాటితో ఎక్కడ ఏం కొనేటట్లు లేదని వాపోతున్నారు. బ్యాంకులో, దుకాణాల్లో, ప్రజలు సైతం తీసుకోవడం లేదు. రూ. 10 నాణేల చలామణిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

కమీషన్ పేరిట మోసాలు..

జిల్లాలో రూ. 10 నాణేలపై జోరుగా దందాలు సాగుతున్నాయి. మార్కెట్‌లో చలామణిలో లేవని పుకార్లు సృష్టిస్తూ పలువురు దానికి వ్యాపారంగా మార్చుకుంటున్నారు. పెద్ద పెద్ద దుకాణాల్లో రూ. 10 నాణేలపై పది శాతం కమీషన్ తీసుకుంటూ దందాలకు పాల్పడుతున్నారు. రూ. 100 నాణేలు ఇస్తే రూ. 90 చెల్లిస్తున్నారు. బ్యాంకుల్లో, మార్కెట్‌ల్లో తీసుకోకపోతే ఎవరూ తీసుకుంటున్నారని పింఛన్‌దారులు, ఉపాధికూలీలు, రైతులు, చిరువ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పది రూపాయాల నాణేలపై అవగాహన కల్పించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

బ్యాంకుల్లో తీసుకోవడం లేదు

పెట్రోల్ బాంక్‌లో ప్రతీ రోజు ఎంతో మంది కస్టమర్లు రూ. 10 నాణేలు ఇస్తున్నారు. వాటిని కౌటాల ఎస్‌బీఐ బ్యాంకుల్లో డిపాజిట్ కోసం వెళ్తే బ్యాంక్ మేనేజర్ తీసుకోవడం లేదు. బ్యాంక్ అధికారులే తీసుకొకపోతే కస్టమర్లు ఎలా తీసుకుంటారు.

– నారాయణ సర్కార్, పెట్రోల్ బంక్ నిర్వాహకులు

నాణేలు తీసుకోవాలి

రూ. 10 నాణేలు తీసుకోకపోతే సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారు. కమీషన్లు తీసుకొని అక్రమ దందాలకు పాల్పడితే చర్యలు తప్పవు. రూ. 10 బిళ్లల నాణేల వినియోగంపై ప్రజలందరికీ అవగాహన ఉండాలి. నాణేల చలామణిపై వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– పుష్పలత, తహసీల్దార్, కౌటాల

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ భీమేశ్

ఇచ్చోడ: దాబా హోటళ్లు, బేకరీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యాజమానులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఇచ్చోడ సీఐ భీమేశ్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో హోటళ్ల యాజమానులతో సమావేశం నిర్వహించారు. నూనె, ఇతర వంట సామగ్రి నాణ్యతగా ఉండాలన్నారు. కుళ్లిపోయిన చికెన్, మటన్, గుడ్లు నిల్వ ఉంచవద్దని సూచించారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై తిరుపతి, హోటళ్ల యాజమానులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

ఉట్నూర్‌రూరల్: నూతనంగా ఎన్నికైన జైనూర్ మార్కెట్ కమిటీ సభ్యులు రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, వైస్ చైర్మన్ బానోత్‌జైవంత్‌రావు, సభ్యురాలు తొడసం రాధాబాయిలు ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

మహాసభ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఇంద్రవెల్లి: ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు తీర్మానం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఆలయంలో రాయిసెంటర్ సార్ మెడిలు, తుడుందెబ్బ నాయకులు, గ్రామాల పటేళ్లు సమావేశమయ్యారు. కార్యక్రమంలో నాయకులు పుర్క బాపురావ్, మెస్రం దుర్గు,సార్‌మేడిలు మెస్రం వెంకట్‌రావ్, మెస్రం చిన్ను, కొట్నాక్ దేవ్‌షావ్, హెరేకుమ్ర జుగాదిరావ్, కొట్నాక్ భారిక్‌రావ్, సిడాం భీంరావ్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న నరేందర్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న వి.నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు. సేవభావంతో పోటీ చేసేందుకు ముందుకొస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం పలు పోటీ పరీక్షలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయనుందని, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులకు మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 150 ఫ్యాన్లు అందించానన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయుల, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే టీచర్ల సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు హెల్త్‌కార్డులు అందజేయనున్నట్లు వివరించారు. సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జలేందర్‌రెడ్డి, శ్రీకాంత్, పున్నరావు, పార్థసారథి, సోగలసుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగ సంఘం అధ్యక్షుడు జయదేవతో పాటు నాయకులు నర్సయ్య, వైఎస్ఆర్ మూర్తి, సత్యనారాయణ, చిన్నయ్య మాట్లాడారు, కాళోజీ చేసిన సేవలను కొనియాడారు. ప్రజా చైతన్యాన్ని తీసుకువచ్చి తెలంగాణ ఏర్పడేందుకు ప్రధాన భూమిక పోషించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.